ప్రాయోజకులు

ఏ. కృష్ణమూర్తి

(కార్యదర్శి - టెలిగ్రాఫ్ ట్రాఫిక్ ఎంప్లాయిస్ కో - ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ)

మరియు

మిత్రమండలి

హైదరాబాదు.

"చూడండీ! ఊళ్ళో బస్సు దిగ్గానే నాకు వరిచెట్లు చూపించాలి" బస్సు కుదుపుల సరిగమలకు - మూన్నెళ్ళ క్రితమే నాతో మూడు ముళ్ళేయించుకున్న సునయన బుంగమూతి పదనిసలు జోడైనాయి.

'వరి... వరి.. చెట్లా! ఇంకా నయం వటవృక్షాలనలేదు.' పొంగుకొస్తున్న నవ్వును గొంతులో అదిమి పెట్టాడు. పాపం! మహానగరాలలో పుట్టిపెరిగిన పిల్లకు మామూలు పంటల గురించి ఏం తెలుస్తుంది?

"వరి చెట్లు కాదు సునయనా!" సుగంధ సింధూరం లాంటి పెదాలనో నిమిషం చూపుల్తో తడిమి "వాటిని వరి క(ర)లనాలి. అదో చూడు! రోడ్డుపక్క పొలాల్లో గాలికి తలలూపుతున్న సన్నని

మొక్కలన్నీ వరికర్రలే" కిటికీలోంచి చూపించాను.

పొద్దున్నే హైద్రాబాదు ఇమ్లీబన్‌లో బస్సెక్కి సిద్ధిపేట ఎక్స్‌ప్రెస్ బస్టాండులో దిగేటప్పటికి మధ్యాహ్నం రెండు దాటింది. ఎక్స్‌ప్రెస్ బస్సులకూ, ఆర్డినరీ బస్సులకూ దోస్తీ కటాఫ్ చేసి వేర్వేరు బస్టాండ్లు ఏర్పాటు చేసి సిద్ధిపేట పట్టణానికో ప్రాధాన్యత కల్పించారని అంతకు ముందే తెలుసు. అప్పటికే కడుపులో ఎలుకల పరుగులు బలం పుంజుకున్నాయి.

హోటల్ మయూరలో భోంచేసి ఆర్డనరీ బస్టాండుకొచ్చేసరికి మూడైంది. చింతమడ్క గ్రామానికెళ్ళే బస్సు రెండున్నరకే బయల్దేరాల్సున్నా చీకూ చింతా లేకుండా అరగంట ఆలస్యంగా బయలు దేరడం మా అదృష్టమే!

సగటు పౌరుని జీవనయానంలా గతుకుల రోడ్డు మీద అతుకుల బస్సు ప్రయాణం. లక్ష్మీదేవిపల్లి వరకు తార్రోడ్డు అనబడే కంకరదేలిన రోడ్డు. మూన్నెళ్ళ క్రితమే జన్మభూమి కార్యక్రమాల్లో భాగంగా ఆ రోడ్డుకు రిపేర్లు చేశారనీ, అంతకుముందు ఇంతకంటే బావుండేదనీ తోటి ప్రయాణీకుల మాటల్లో తేటతెల్లమైంది. బస్సు లక్ష్మీదేవిపల్లి వద్ద ఎడమవైపు తిరిగిమట్టి రోడ్డు మీద ప్రవేశించింది. రోడ్డు పక్కన రెండు వైపులా సావధాన్‌లో సెల్యూట్ చేస్తున్న సైనికుల్లా నీలగిరి చెట్లు వరుసగా కన్పించాయి. సీతారాంపల్లి వరకు అదే దృశ్యం. ఆ తర్వాత మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న ముత్తైదువుల్లా పూలు విరబూసిన తంగేడు చెట్లు... ఒళ్ళు పులకరించింది. కన్నతల్లి వీపునిమిరినట్టు హాయిగా ఉంది.

"ఆహా! బ్యూటీఫుల్!" నా భుజమ్మీద ఒరిగింది సునయన.

చింతమడ్క గ్రామంలో మా గంగాధరం బాబాయున్నాడు. మా నాన్నకు ఏకైక తోబుట్టువతడు. నెలకు రెండు మూడుసార్లన్నా హైద్రాబాదొస్తాడు. వచ్చినప్పుడల్లా మా అమ్మ చేత తనకిష్టమైన పదార్థాలన్నీ చేయించుకు తింటాడు.

"అందుకే అన్నారు వదినా, అన్నయ్య భార్యంటే అమ్మతో సమానమని. తల్లిలేని నాకు తల్లివై పెంచావు. హైద్రాబాదులో పనున్నా లేకపోయినా నీ చేతి వంట రుచి కోసమన్నా వస్తానొదినా!" అంటూ మా అమ్మను ఏనుగు మీదెక్కిస్తాడు.

వారం క్రితం వచ్చినప్పుడు మా అమ్మ

"గంగాధరం ! మా కోడలిక్కడే పుట్టిపెరిగింది. వచ్చే ఉగాదికి ఏదన్నా పల్లెటూరు వెళ్ళాలని సరదాపడ్తుందయ్యా! ప్రాణాలొదుల్తున్న మీ నాన్న కోరిక ప్రకారం చింతమడ్క ఇల్లూ, పొలాలు నీకే వదిలేస్తిమి. కొడుకు, కోడల్ని అక్కడికి పంపిద్దామంటే... అక్కడ మాకేముందనీ?" అంటూ చిన్నబోయింది.

"ఎంత మాటొదినా! నేనులేనా! నా మీద ఒట్టు. వాళ్ళనక్కడికే పంపండి. ఈ ఉగాదికి నాకూతురూ, అల్లుడు కూడా అమెరికా నుండి వస్తున్నారు. సరదాగా గడిపేస్తారొదినా!" అన్నాడు- పెరుగన్నం ముద్దకు మిరపకాయబజ్జీ నంజుకుంటూ. వెంటనే నాతో, సునయనతో కూడా చెప్పాడు తప్పకరావాలని. సునయన ముఖారవిందము వేయిరేకులుగా విచ్చుకుంది. మూర్ద్రోజుల సెలవుబెట్టి బయలుదేరానందుకే.

బస్సుదిగి ఊరివైపు నడుస్తూంటే ఉత్సాహం ఉబికొచ్చింది. బాటకు కుడి వైపున విస్తరించిన వరి పొలాల్లో కూలీ జనం జానపదాలు పాడుతూ పంజేసుకుంటున్నారు. ఎడమవైపు చెలకలో గొడ్లకాపరి పిల్లాడు చెట్టుకు జేరగిలబడి పిల్లన గ్రోవి ఊదుతున్నాడు. సినిమాల్లో తప్ప ఇలాంటి దృశ్యాలు ఇదివరకు చూడని సునయన - గాలికి చెంపల మీదాడుతున్న ముంగురుల్ని సవరించుకుంటూ.

"డాన్స్ చెయ్యాలన్పిస్తుందండీ!" అంది. ఆమె పట్టాగొలుసు గజ్జెల శబ్దం లయబద్ధంగా విన్పిస్తూంది.

చేతిలో చెయ్యేసుకుని చెరువుకట్టమీద నడుస్తున్నాం. కిలకిలలు రువ్వుతూన్న కన్నెపిల్ల బుగ్గల్లా చెరువులో విచ్చుకున్న తామరపూలు అలల తాకిడికి ఒయ్యారంగా నర్తిస్తున్నాయి.

కబుర్లు చెప్పుకుంటూ, వోణీలు సవరించుకుంటూ చంకన బిందెతో ఎదురొస్తున్న ఆడపిల్లలు మమ్మల్ని గమ్మత్తుగా చూస్తున్నారు. దొరవారి బంగళా, కచేరి చావడీ దాటి శివాలయం ముందుకొచ్చేసరికి ఆరైంది. బలహీనమైన సూర్యకిరణాలు ఆలయ గోపురానికి బంగారు పూతలు పూస్తున్నాయి. అలనాటి జ్ఞాపకాలు జోరీగల్లా నన్ను చుట్టుకుంటున్నాయి.

"చిన్నప్పుడు ఈ గుళ్ళోనే చిర్రాగోనె, కబడ్డీ ఆడుకునే వాళ్ళం సునయనా!" అన్నాను తమకంగా.

"మీరీ ఊరు ఎప్పుడూ వస్తుంటారా?"

"మా తాతయ్య బతికున్నప్పుడు చాలాసార్లొచ్చాను. మూడేళ్ళక్రితం బాబాయి కూతురు సుమిత్ర పెళ్ళికొచ్చాను"

ఎదురుగా వస్తున్న పూజారిగారు కళ్ళమీద పడ్తున్న సూర్యకిరణాలను అరచేత్తో అడ్డుకుంటూ

"ఎవరూ! కమలాకర్ మాస్టారు కొడుక్కదూ!" అడిగారు.

"ఔనండీ! మురళీధర్‌నే, ఈవిడ నా భార్య సునయన."

ఇద్దరమూ నమస్కరించాం.

"శ్రీఘ్రమేవ సంతాన ప్రాప్తిరస్తు" ఆశీర్వదించారు.

సిగ్గులు అలుముకున్న శ్రీమతి బుగ్గల మీద పసిడి కిరణాలు తళుక్కుమన్నాయి.

బాబాయి ఇల్లంతా సందడిగా ఉంది. సుమిత్ర దంపతులు నిన్ననే వచ్చారని పూజారిగారి ద్వారానే తెలిసింది.

బాబాయి పదిహేనేళ్ళ కొడుకు కాంతారావుతోపాటు ఇంకెవరెవరో సుమిత్ర దంపతుల చుట్టూచేరి అమెరికా వింతలు విశేషాలు చెవులప్పగించి వింటున్నారు. మా ఉనికినెవ్వరూ గమనించేట్టులేరు. కాస్సేపలాగే నుంచుండిపోయాం గడపలో.

"అదిగో అన్నయ్యొచ్చాడే!" పొరపాటున ఇటు చూచిన కాంతారావు అరిచినంత పంజేశాడు. అందరి దృష్టి లిప్తకాలం మా వూపు మళ్ళింది.

"రారా మురళీ! రామ్మా సునయనా!" బాబాయ్ పిలిచి మమ్మల్ని తన అల్లునికి పరిచయం చేశాడు.

"వెరీ గ్లాడ్ టు సీయూ కపుల్!" అమెరికా అల్లుడు లేచి నాతో కరచాలనం చేశాడు. అదే చేతిని సునయనకందించబోయాడు.

"చాలా సంతోషమన్నయ్యా!" చేతులు జోడించిందామె.

"అయ్యో! పట్నం వదినకు ఫార్మాలిటీస్ కూడా నేర్పలేదారా అన్నయ్యా!" నవ్వుతూ లేవబోయి కూచుంది సుమిత్ర.

ఆనాడు దొండకాయలాగున్న సుమిత్ర ఈనాడు దోసకాయలాగైంది. చాలా మారిపోయింది. బాబ్డ్ హెయిర్ వచ్చేసిందే!

"ఏమో అనుకున్నాను గాని వదిన ఏంజిల్‌లాగుందే అమ్మా!" అంది తల్లితో - కళ్ళూ, వేళ్ళూ తిప్పుతూ.

"ఆ ఉందిలే గంజిలీగలా!... ఓ మోస్తరుగుంది." పిన్ని మూతి ముడుచుకుపోయింది. బాబాయి చూపులు మరోవైపు మళ్ళాయి.

ఇంకేముంది! మేము కుడితిలో పడ్డ ఎలుకల్లాగైపోయాం.

సుమిత్రకూ, దాని భర్తకూ రాచమర్యాదలు జరిగిపోతున్నాయి. మాపెళ్ళిలో వదినా, వదినా అంటూ సునయననో ఆట పట్టించిన కాంతారావు సేవలు గూడా బావగారికే పరిమితమయ్యాయి. బెల్లం చుట్టూ ఈగల్లా అందరూ వాళ్ళ చుట్టే. సునయన మొహమ్మీద కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. తెల్లవారితే ఉగాది పండుగ.

నేనూ, నా భార్య కనబడగానే బాబాయింట్లో అంతా ఎగిరి గంతేస్తారనుకుంటే... ఇలాగైందేమిటీ? రాత్రంతా కలత నిద్ర.

పొద్దున స్నానాదులు, టిఫిన్లు చకచకా ముగించి పేకాటలో పడ్డారంతా. మాకేమీ అర్థంగాక మొహాలు చూసుకున్నాం.

"అత్తయ్యా! ఈరోజు ఉగాది పచ్చడి తినాలి గదా! పూజా అదీ.....!" బెరుకు గొంతుతో గుర్తుచేసింది సునయన మా పిన్నికి.

"ఆ.... ఆపాత చింతకాయ పచ్చడి పద్ధతులు మా అల్లునికి నచ్చవట!" చేతులు తిప్పేసింది పిన్ని.

బెదిరిన లేడిలా నావద్దకు వచ్చింది సునయన.

"ఇహ మనం వెళ్ళిపోదామండీ!"

"సరే" నన్నాను. అందరి ముందే సూటుకేసుతో బయలుదేరాం.

పిల్లల్లా అడుగు లేస్తూ శివాలయం ముందుకొచ్చాం. ఓసారి గుళ్ళోకెళ్తే బావుండన్పించింది. సునయన బలపరిచింది.

గుడి గేటు దాటాం. గర్భగుడికీ గేటుకూ మధ్య బొండుమల్లె చెట్లు, కనకాంబరం మొక్కలు గాలి తరగలకు తలలూపుతూ పరాచకలాడుకుంటున్నాయి. బొండుమల్లెలూ, కనకాంబరాలు ముందుకు నడిచి వెళ్ళడానికి వీల్లేనంత దట్టంగా నేలమీద పరుచుకున్నాయి. అవి ఎప్పట్నుంచి రాలి పడ్తున్నాయో! పూరేకులు నీరెండకు మంచి ముత్యాల్లా మెరుస్తున్నాయి. దోసెడుపూలు తీసి సునయన తలమీద పోశాను. పెళ్ళిలో తలంబ్రాల దృశ్యం గుర్తుకొచ్చింది. ఆవిడ మొహం పారిజాత పుష్పంలా విప్పారింది. సంతోషాన్ని పట్టలేక నా గుండెల మీద వాలిపోయింది.

దేవుడికి దండం బెట్టి బయటికొచ్చాం.

"ఎవర్నాయనా ! మురళా ?" మా నాన్న బాల్య స్నేహితుడు నారాయణ బాబాయ్ పలుకరించాడు. అతడు హైద్రాబాదుకొచ్చినప్పుడల్లా మా నాన్నగారితో కొన్ని గంటలన్నా గడపేస్తాడు. ఈ మధ్యే వాళ్ళ కొడుకు దేవరాజు ఎంసెట్ ఎంట్రెన్స్ పరీక్ష రాసేందు కొచ్చినప్పుడు గూడా మా ఇంట్లోనే ఉన్నారు.

"ఔను బాబాయ్! నిన్ననే వచ్చాం. ఇప్పుడెళ్తున్నాం!" అనుకోకుండా గొంతు వణికింది.

"ఈ అమ్మాయి నీ భార్య గదూ!"

" ఔను బాబాయ్, పేరు సునయన"

సునయన నమస్కరించింది.

"ఇంత దూరం వచ్చి మా ఇంటికి రాకుండా వెళ్ళిపోవడం న్యాయంగా ఉందా మురళీ?' ' అక్కున చేర్చుకున్నాడు.

తైవాన్ వీధిలో తెలుగువాడు పలుకరించినట్టు- ప్రాణం లేచొచ్చింది. మా భావాలేవీ బయటపడకుండా మంచున్నాం. ఏమనాలో తోచలేదు. గబుక్కున సూటుకేసందుకుని

"మీ వాళ్ళంతా అమెరికా అల్లుని మోజులో ఉన్నారు గదూ! పద మనింటికెళ్దాం!" అంటూ దారి తీశాడు. మాకూ తప్పలేదు.

"ఏమేవ్! ఎవరొచ్చారో చూడు!" వాకిట్లోంచే కేకేశాడు, ఓ కలెక్టర్‌ను వెంటబెట్టుకొచ్చినట్టు.

"ఓహో! మురళన్నయ్యా! వదినా! బలే బలే" దేవరాజు పరుగెత్తుకొచ్చి నా చెయ్యందుకున్నాడు.

"ఆహా! ఇవాళ్ళ శుభదినం. మురళీ... కొత్త కోడలు గూడా!" పిన్ని సునయను పొదివి ఒళ్ళోకి లాక్కుంటూ

"అత్తామామలు బాగున్నారామ్మా!" అడిగింది. అప్యాయంగా.

"బాగున్నారత్తయ్యా!" అంటుందో లేదో దేవరాజు అక్క

"వారెవ్వా! మురళన్నయ్యకు స్వాగతం. వదినగారికి సుస్వాగతం." సిసింద్రీ సుగుణ సునయన బుగ్గమీద చిటికేసి తీసుకెళ్ళింది.

వదినా వంకాయ తొడిమా అంటూ, వదినెకు వగసరి బిందెకు బిగసరి పాడుతూ జడలాగుతూ సునయనతో పరాచకాలాడుతూనే ఉంది. సునయన ఉల్లాసంగా మారింది.

సరదా కబుర్లతో పచ్చడి, ఆ తర్వాత బొబ్బట్లతో భోజనం ముగించాం. ఆ రోజక్కడే ఉండాలని పట్టుపట్టారు.

రాత్రికి పెరట్లో మల్లెపూలు పరిచిన మంచం మాకోసం ఏర్పాటైంది. మా ఆనందానికి హద్దుల్లేవు.

మర్నాడు మయలుదేరే ముందు పిన్ని సునయనకు బొట్టుపెట్టి కొత్తచీర పెట్టింది. సునయన పాదాభివందనం చేసింది.

"మా మురళిని కొంగుకు ముడేసుకున్నావు. నిండా నూరేళ్ళు పసుపు కుంకాలతో వర్ధిల్లు తల్లీ!" అంటూ భుజాలు పట్టిలేపి గుండెలకు హత్తుకుంది.

సుగుణ, దేవరాజులైతే సూటుకేసును బస్సుదాకా మోసుకొచ్చారు. బస్సెక్కేముందు సుగుణ సునయన చెంపగిల్లి

"వదినా! ఈ ఆడబిడ్డ నీకు అర్ధమొగుడని గుర్తుంచుకో. వచ్చే ఏటికి చంక పాపతో రాకపోతే చెవులు మెలేస్తా. జాగ్రత్త!" హెచ్చరించి కిలకిలా నవ్వింది.

సునయవ కళ్ళు చిప్పిల్లాయి.

"అలోగా నువ్వు పెళ్ళిచేసుకుని పెనిమిటితో వెళ్ళిపోవనే గ్యారంటీ ఏమిటి మరదలా?" అంటూ బుగ్గగిల్లి గట్టిగా కౌగిలించుకుంది.

ఇద్దరి నవ్వులు - లేమావి చిగుళ్ళు కడుపారా భోంచేసిన కోయిల పాటల్లా విన్పించాయి.

'జాగృతి' సంక్రాంతి సంచిక (జనవరి 12 - 18 ) 1998.